ప్రజాశక్తి
శనివారం 9 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

ఆశ్రమ పాఠశాలల్లో
ఎఎన్ఎంలను నియమించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వరుసగా మరణించడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోందని తెలిపారు. వెంటనే విద్యార్థులకు టోటల్ బాడీ చెకప్ చేపట్టాలని కోరారు. మరణాలకు మూల కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పత్తి విక్రయించాలంటే..
150 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

ముచ్చర్లవలసలో జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

- ముచ్చర్లవలస వద్దనున్న జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు
- రైతుల్లో ఆందోళన
- ఎఎంసి యార్డులో పెట్టాలని డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురం

విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస గ్రామం వద్ద ఉన్న ప్రతు జిన్నింగ్ మిల్లు ఆవరణలో సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం మార్కెటింగ్ జిల్లా అధికారి ఐ.గంగాధర్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాలో పండించిన రైతులంతా పత్తిని ప్రతు జిన్నింగ్ మిల్లుకే తరలించాలని అధికారులు చెబుతున్నారు. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 50 కిలోమీటర్ల నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాల నుంచి రామభద్రపురం జిన్నింగ్ మిల్లుకు రవాణా చేయాలని అధికారులు చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో

పత్తి రైతులకు ఈ ఏడాది పాట్లు తప్పేటట్లు కనిపించడం లేదు. పత్తి విక్రయించుకుందామంటే సుమారు 50 కిలోమీటర్ల నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాల్సి రావడమే అందుకు కారణం. మన్యం జిల్లాలో పత్తి పండించిన రైతులు విజయనగరం జిల్లాలో ఏర్పాటుచేసిన సిసిఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లి, అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. దూరభారంతో పత్తి రైతులు ఈ ఏడాదీ నష్టపోయే పరిస్థితి తలెత్తింది.

పత్తి క్వింటా ధర రూ.6200 నుంచి 6400 వరకు పలుకుతోంది. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7500 నుంచి 7120 వరకు ఉంది. అయితే సుదూర ప్రాంతాల నుంచి పత్తిని జిన్నింగ్ మిల్లుకు రవాణా చేయాలని చెప్పడంతో రైతులు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. నాణ్యతా ప్రమాణాలు బాగోలేదనే సాకు చూపి జిన్నింగ్ మిల్లుకు తీసుకెళ్ళిన పత్తిని తిరస్కరిస్తే తమ పరిస్థితి ఏమవుతుందని గగ్గోలు పెడుతున్నారు. జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో మార్కెటింగ్, సిసిఐ అధికారులు కుమ్మక్కై ఎఎంసి యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గిట్టుబాటు ధర దక్కకుండా దోపిడీ చేయడానికి అధికారులు జిన్నింగ్ మిల్లు వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఎంసి యార్డు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి • ఆశ్రమ పాఠశాలను సందర్శించిన మంత్రి, ఎమ్మెల్యేలు

విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

గిరిజన విద్యార్థి జీవన్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని రావాడ రామభద్రపురం బాలుర ఆశ్రమ పాఠశాలను కురుపాం, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, విజయ్‌చంద్ర, జయకృష్ణతో కలిసి మంత్రి సందర్శించారు. విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. పూర్తి స్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన్ కుమార్ మృతి పట్ల విచారం వ్యక్తంచేశారు. అటు వైద్యులు గాని, ఇటు పాఠశాల సిబ్బంది గాని అన్ని విధాలా ప్రయత్నాలు చేసినప్పటికీ విద్యార్థి బతకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంక్షేమ వసతిగృహాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో రాత్రి వేళల్లో పాఠశాల తరపున బాధ్యత వహించిన అధికారి కచ్చితంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అన్ని గిరిజన పాఠశాలల్లో వైద్య సిబ్బందిని త్వరలో నియమిస్తామని ప్రకటించారు. విద్యార్థి కుటుంబానికి వీలైనంత వరకు సహాయాన్ని అందించి ఆదుకుంటామని తెలిపారు.

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని ధర్నా

గిరిజన విద్యార్థి జీవన్‌కుమార్ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని వామపక్షాలు, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాల ఎదుట శుక్రవారం వామపక్షాలు, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన్ కుమార్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమించాలని, వాటర్ ప్లాంట్లను బాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో జీవన్‌కుమార్ తండ్రి కృష్ణారావు, మాజీ జెడ్‌పిటిసి కడ్రక బలరాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, నాయకులు కోలక మల్లేష్, ఎం.శివ, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గోరపాడు సోమయ్య, నాయకులు కూరంగి సీతారాం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, బికెఎం నాయకులు తోట జీవన్, జి.సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాలు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ధాన్యం కొనకుంటే
సచివాలయాలు, ఆర్ఎస్‌కెల వద్ద ధర్నాలు

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చాలా కర్కశంగా వ్యవహరిస్తోందని, వారి గోడు పెడచెవిన పెట్టడం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు చేయకుంటే సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వద్ద ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ధాన్యం రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసుతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ధాన్యం సీజనల్ ప్రారంభమైనప్పటికీ ఎక్కడ కొనాలో, ఎప్పుడు కొనాలో, ఎవరికి అమ్మాలో ఈరోజుకీ ఎటువంటి ప్రణాళికా ప్రభుత్వం దగ్గర లేకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం కంటే, కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరుకుంటుందని ప్రతిరోజూ డిప్యూటీ ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి ఆర్భాటపు ప్రకటనలు తప్ప రైతుకు ఎటువంటి భరోసా లేదని ఆక్షేపించారు. క్వింటాకు రూ.1700 నుంచి 1800 వరకు దళారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. పెత్తందారులతో, దళారులతో ప్రభుత్వం కుమ్మక్కైందని భావించాల్సి వస్తోందన్నారు. అలా కాకుంటే రైతుల దగ్గర నుంచి ఎందుకు ధాన్యం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు

కొనుగోలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రైతులు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వమే నేరుగా కనీసం మద్దతు ధర రూ.2300కు కొనాలని డిమాండ్ చేశారు. అంతకంటే తక్కువ ధరకు రైతులు ఎవరూ అమ్మొద్దని కోరారు. మద్దతుధరకు ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం మూటలతో ముట్టడించాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులు చేపట్టే ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ప్రతీ శుక్రవారం గ్రామదర్శిని

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కురుకుట్టిలో పర్యటన

ప్రజాశక్తి-సాలూరురూరల్

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రతీ శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన సంక్షేమ బాలుర గురుకుల వసతిగృహంలో పల్లెనిద్ర చేసిన కలెక్టర్... శుక్రవారం సాలూరు మండలంలోని కురుకుట్టి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మమేకమై ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల నిర్వహణ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేశారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదర్శిని కార్యక్రమం ద్వారా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత కేసులు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నందున ప్రత్యేక శ్రద్ధతో పౌష్టికాహారం అందించాలన్నారు. నెల నెలా రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య తనిఖీలు, గ్రామాలలో పరిశుభ్రత, పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ ఉంటుందన్నారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో బడితోట నిర్వహణకు ప్రోత్సాహం, గ్రామ పంచాయతీల నిధులతో బాల విహార్ కింద పిల్లల ఆట విడుపుకోసం మైదానం

గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు

ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. సురక్షితమైన తాగునీరు అందేలా, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా తోడ్పాటును అందించాలని తెలిపారు.

సికిల్‌సెల్ ఎనిమియా విద్యార్థినికి మెరుగైన వైద్యం

ఇంటర్మీడియట్ చదువుతున్న హేమలత సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతుండటంతో కలెక్టర్ దగ్గరుండి రక్త పరీక్షలు నిర్వహించాలని ఎఎన్ఎంలను ఆదేశించారు. బాలికకు రక్తహీనత ఉన్నట్లు తేలడంతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందాలని అవసరమైతే రక్త మార్పిడి చేయాలని వైద్యులు అజయ్‌కు సూచించారు. రక్తహీనత కేసులు ఎక్కువగా ఉంటున్నందున రక్త నిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హై రిస్క్ గర్భిణులను ముందస్తుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని ఆశావర్కర్లకు సూచించారు. ఏ ఒక్క గర్భిణి విషయంలో నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రేషన్, పింఛన్లకు ఇక్కట్లు

గ్రామంలో ఇంటర్నెట్ సౌకర్యం లేక రేషన్, పింఛను పొందేందుకు కష్టతరం అవుతుందని కలెక్టర్ దష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. జిల్లాలో 70 సెల్ టవర్లకు గానూ బిఎస్ఎన్ఎల్ 27 , జియో 11 టవర్లు నిర్మాణం కావాల్సి ఉందని, త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అక్కడ నుంచి వెలగవలస గ్రామాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నవి, లేనిది పరిశీలించారు. జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, తహశీల్దారు రమణ, ఎంపిడిఒ జి.పార్వతి, ఎపిఎం సింహాచలం, ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఆడపిల్లలను మాటంటే ఊరుకోం

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆడపిల్లలను సోషల్ మీడియాలో అసభ్యకరంగా దూషించినా, హేళన చేసినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సిఎం జగన్ తన సొంత మీడియాలో తల్లి, చెల్లిపై వ్యాఖ్యలు చేస్తూ అబాండాలని వేస్తున్నారని చెప్పారు. ఎవరింటి ఆడపిల్ల అయినా తమ ఇంటి అడపిల్లగానే భావించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ, మండల నాయకులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుళ్ల వేణుగోపాల్, పిన్నింటి ప్రసాద్ బాబు, అప్పారావు, యుగంధర్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-మక్కువ

గిరిశిఖర గ్రామాల్లో గిరిజనులకు అందుబాటులో ఉండేలా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జనసేన మండల నాయకులు పెంట తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు శుక్రవారం అమరావతిలో మంత్రి చాంబర్లో కలిసి వినతిని అందజేశారు. ప్రజలకు అందుబాటులో చౌక దుకాణాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని ఈ సందర్భంగా మంత్రి మనోహర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎ.మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న హెల్త్, వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు విస్తృతం చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని కల్లికోట, గుణానుపురం హెల్త్, వెల్నెస్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు, నమోదు చేసిన అనారోగ్య సమస్యలు, ఏ విధమైన చికిత్స అందజేస్తున్నారని రికార్డుల్లో పరిశీలించారు. తనిఖీలకు వచ్చిన ప్రతిఒక్కరి ఆరోగ్య సమస్యను వైద్య సిబ్బంది స్పష్టంగా తెలుసుకోవాలని, తద్వారా సరైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఎన్‌సిడి రికార్డులో దీర్ఘకాలిక రోగుల వివరాలు పరిశీలించారు. వీరిలో ఆరోగ్యం మెరుగు చెందని వారిని గుర్తించి అందుకు కారణాలపై విశ్లేషణ చేయాలన్నారు. మందులు పరిశీలించి కాలపరిమితి చేరువలో ఉన్నవాటిని సద్వినియోగం చేయాలన్నారు. కేంద్రంలో రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రీ-పిఎంఎస్ఎంఎ ద్వారా గర్భిణులకు తనిఖీలు చేపట్టి, హైరిస్క్ సమస్యలను గుర్తించాలని చెప్పారు. హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. హీమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల లభ్యతను పరిశీలించారు. రక్తహీనతగా గుర్తించిన విద్యార్థిని పరిశీలించగా, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యకు చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యం మెరుగుకు ఆయన తగు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి రక్తహీనత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పలు ఆరోగ్య సూత్రాలు వివరించి, అవగాహన కల్పించారు.

అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

అనంతరం ఎ.గదబవలస గ్రామంలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తి ఆరోగ్య స్థితిని జగన్మోహన్ పరిశీలించారు. కేస్ షీట్‌ను తనిఖీ చేసి చికిత్సా వివరాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ నాగభూషణరావు, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది వర్షిణి, నాగేంద్ర, శ్రావణి, లక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

10న పోలమాంబ జాతర తేదీలు ఖరారు

ప్రజాశక్తి-మక్కువ

వచ్చే ఏడాది జరిగే ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శంబర పోలమాంబ జాతరకు సంబంధించిన తేదీలను ఈ నెల 10న ఖరారు చేయనున్నట్లు ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక చదురుగుడి వద్ద గ్రామపెద్దలు, ఇతర కమిటీ సభ్యులతో కలిసి ఈ తేదీలను నిర్ణయించనున్నట్లు చెప్పారు.

కబడ్డీ పోటీలకు మామిడిపల్లి విద్యార్థి ఎంపిక

సాలూరు రూరల్ : అండర్-14 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు మామిడిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి జరజాపు బాలాజి ఎంపికయ్యాడు. బాలాజిని ప్రధానోపాధ్యాయులు ఎన్ వెంకట్రావు, పీడీ ఆనంద్, పాఠశాల విద్యా కమిటి చైర్‌పర్సన్ బుగత రవణమ్మ, ఉపాధ్యాయులు, సర్పంచ్ శశికళ, డొంక అన్నపూర్ణ, బి.తవుడు, రామకృష్ణ, మాధవరావు, తాడుతూరు తిరుపతి రావు అభినందించారు.

ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం /కురుపాం

విధి నిర్వహణలో ఉన్న ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఏజెన్సీలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... కురుపాం మండలంలోని కొండబారెడి గ్రామానికి చెందిన హిమరిక జ్యోతి... మొండెంఖల్ సబ్ సెంటర్‌లో ఎఎన్ఎంగా పనిచేస్తున్నారు. ఎప్పట్లాగానే శుక్రవారం సబ్ సెంటర్‌కు వెళ్లిన ఆమె మధ్యాహ్నం 12 గంటల సమయంలో మలేరియా మాత్రలు (క్లోరోక్విన్) మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిని గమనించిన తోటి సిబ్బంది వెంటనే పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించి, వైద్యం చేయించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియ రాలేదు.

చికిత్స పొందుతున్న ఎఎన్ఎం జ్యోతి

ఎఒబిలో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని ఒడిశా సరిహద్దు గ్రామమైన రంగాలగూడ సమీపంలో శుక్రవారం ఏనుగుల గుంపు సంచరిస్తోంది. నెల క్రితం ఏడు ఏనుగుల గుంపు పార్వతీపురం మండలంలో ప్రవేశించి, పలు గ్రామాల్లో సంచరిస్తూ జనాలను భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రంగాలగూడ గిరిజన గ్రామ పరిధిలో తోటల్లోకి ఏనుగులు చేరుకుని విశ్రాంతి తీసుకుంటోంది. ట్రాకర్లతో కలిసి అటవీశాఖ రేంజర్ మనోజ్ కుమార్ ఏనుగుల కదలికలు గమనించారు. శుక్రవారం రాత్రికి ఏనుగులు ఒడిశా వైపు వెళ్లే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రజలెవరూ ఏనుగుల వైపు వెళ్లి వాటి ఏకాంతానికి భంగం కలిగించకుండా పహారాను కట్టుదిట్టం చేయాలని సిబ్బందికి సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై సందిగ్ధం

● ధీమా వ్యక్తం చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘురాజు

● పోటీకి సై అంటూ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసిన శంబంగి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర సంధ్దిగత నెలకొంది. కోర్టు ఆదేశాలతో తాను ఎమ్మెల్సీ పదవిలో కొనసాగేందుకు ఎలాంటి ఢోకా లేదంటూ ఇందుకూరి రఘురాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైసిపి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు కూడా స్థానిక సంస్థల్లో అవసరానికి మించినంత మెజార్టీ ఉన్న నేపథ్యంలో గెలుపు తనదేనంటూ ముందుకు సాగుతున్నారు. ఇంకోవైపు కోర్టు ఆదేశాల తరువాత కూడా ఎన్నికల సంఘం వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. నామినేషన్ల స్వీకరణ మొదలుకుని, ఎన్నికల ఏర్పాట్లు వరకు యథాతథంగా ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడా ఇటీవల ప్రకటించారు. దీంతో, ఈ ఎన్నికల వ్యవహారంపై తీవ్ర సందిగ్ధత, అయోమయ పరిస్థితులు నెలకున్నాయి. జిల్లాలో 549 ఎంపిటిసి, 34 జెడ్‌పిటిసి, 160 కౌన్సిలర్లు, కార్పొరేటర్, 9 నియోజకవర్గ స్థానాలు ఉన్నాయి. ఈ లెక్కన మొత్తం 743 మంది ఓటర్లు కాగా, ఇందులో 9మంది ఎంపిటిసి సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో, ప్రస్తుత ఓటర్ల మాత్రం 734మందే. ఇందులో అత్యధికంగా వైసిపికి చెందిన వారు 579 మంది ఉన్నారు. టిడిపికి మిగిలినవారు కేవలం 155 మంది మాత్రమే. ఈ నేపథ్యంలో టిడిపి నుంచి పోటీచేసేందుకు నాయకులెవరూ ఆసక్తి చూపడం లేదు. ఒకరిద్దరు అవకాశం ఇస్తే పోటీచేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నా 'ఓడిపోయేకన్నా ఒసిలిపోతే మేలు' అన్న రీతిలో టిడిపి వ్యవహరిస్తోంది. దీంతో, తమ గెలుపు అనివార్యమంటూ వైసిపి నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు చెబుతున్నారు. ఇందుకు తగ్గట్టే వైసిపి అభ్యర్థి గురు, శుక్రవారాల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 11న మరో సెట్ కూడా నామినేషన్లు వేయనున్నట్టు సమాచారం. అసలు ఎన్నిక జరిగితే కదా అంటూ ఎమ్మెల్సీ రఘురాజు, ఆయన అనుచరులు, టిడిపిలోని కొందరు నాయకులు అంటున్నారు.

గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. కాలపరిమితి ప్రకారం ఆయన 2027 నవంబర్ 31వరకు కొనసాగాల్సివుంది. కానీ, గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో, శాసన మండలి చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేసిన సంగతి విధితమే. దీనిపై రఘురాజు అప్పట్లోనే కోర్టును ఆశ్రయిం చారు. కోర్టు ఆరువారాలపాటు స్టే విధించింది. ఈ విషయమై బుధవారం (ఈనెల 6న) కోర్టు తీర్పురావాల్సి ఉన్నప్పటికీ, 3వ తేదీనే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్ విడుదల చేసింది. వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. వాస్తవానికి కోర్టు వాయిదా మూడు రోజులకు ఉందని తెలిసి కూడా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసియడం, 6వ తేదీన సిట్టింగ్ ఎమ్మెల్సీకి అనుగుణంగా కోర్టు తీర్పు వెలువడం వంటి కారణాలతో ఎన్నికల ప్రకియపై అద్యంతం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

శంబంగి రెండోసెట్ నామినేషన్ దాఖలు

వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు 2వ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ కు మధ్యాహ్నం తన నామినేషన్ పత్రాలు అందజేశారు. మోడల్ కోడ్ ను తప్పక పాటించాలని, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలని అభ్యర్థికి సూచించారు.

గిరిజనులతో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో బసచేసిన పిఒ.. శుక్రవారం సీతంపేట పంచాయతీలోని వాబ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని అన్ని వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కాలువలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని పిఒను కోరారు. స్పందించిన పిఒ కాలువలు శుభ్రం చేసేందుకు, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గృహ నిర్మాణ బిల్లులు కూడా మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పిఒ గ్రామస్తులకు సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం సీతంపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, సిడిపిఒ రంగలక్ష్మి సర్పంచ్ కళావతి, ఇఒపిఆర్‌డి సత్యం, కార్యదర్శి బి.రామకృష్ణ, విఆర్ఒ అరుణ జ్యోతి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ నుంచి మినహాయించాలి

ఆర్‌జెడికి ఎంఇఒల అసోసియేషన్ వినతి

ఆర్‌జెడికి వినతి అందిస్తున్న సామల సింహాచలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్కూల్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం నుంచి ఎంఇఒలను మినహాయించాలని ఆర్‌జెడి విజయ్ భాస్కర్‌కు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అపార్ నమోదు, ఎస్ఎ- 2 పరీక్షల నిర్వహణ, పాఠశాలల తనిఖీలు, తదితర విద్యా శాఖ కార్యక్రమాలను ఎంఇఒలు పర్యవేక్షించాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ తరుణంలో శిక్షణకు ఎంఇఒలు హాజరుకావాలని ఉత్తర్వులు ఇవ్వడం ఇబ్బందికరంగా ఉందన్నారు. మండల స్థాయిలో విద్యా కార్యక్రమాల అమలుకు ఆటంకం కలుగుతుందని చెప్పారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎటిడబ్ల్యుఒ, హెచ్‌ఎం, తదితరులు

వాలీబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-సాలూరు రూరల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు తోణాం జిటిడబ్ల్యుఎహెచ్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. వీరు భోగాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన విద్యార్థులు సాయివినోద్, వెంకటరావును ఎటిడబ్ల్యుఒ కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఆర్.సింహాచలం, వార్డెన్ లచ్చయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఈశ్వర్ అభినందించారు.

ఎండియు వాహనం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

కందిపప్పు, పంచదార కరువు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మండల కేంద్రంలోని ఆరో వార్డు పరిధిలో రేషన్ బియ్యం తప్ప పంచదార, కందిపప్పు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎండియు వాహనం వద్ద నిరసన తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయలేకపోతున్నామని వారు వాపోయారు. ప్రతి నెలా కందిపప్పు, పంచదార అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై సిఎస్ డిటి మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, కందిపప్పు నిల్వ ఉందని, ఆన్‌లైన్ కాకపోవడంతో పంపిణీ చేయలేదని వివరణ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో వెంకటాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజేష్ కథనం ప్రకారం... వెంకటాపురం గ్రామంలో నాగుల చవితి రోజు ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో కె.నరసింహులు కుమారుడు శివకృష్ణపై కేసు నమోదైంది. తన వల్లే కుమారుడు కేసులో ఇరుక్కొన్నాడని మనస్తాపంతో నరసింహులు గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. దీంతో చికిత్స కోసం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఆయన మరణించాడు. శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శుక్రవారం 5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా విజయవాడకు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి పట్టుబడింది. వారిని పోలీసులు అరెస్టు చేశారు. వారికి గంజాయి విక్రయించిన ఒడిశాకు చెందిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గుమ్మలక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం



గుమ్మలక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఇలాంటి తరుణంలో విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం దారుణమన్నారు. ఉద్యోగం, ఉపాధి లేక నిరుద్యోగులు పెరిగారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై ఈ నెల 13 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టి, 14న తహశీల్దార్ కార్యాలయల వద్ద ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బజారు వద్ద కళాసీలు, కార్మికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, నాయకులు మండంగి రమణ, పువ్వల తిరుపతిరావు, బిడ్డిక శంకర్రావు, ఆడిత్, కె.గౌరీశ్వరరావు, కె.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రజా సమస్యలపై ఈ నెల 14న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు.

ఉలిపిరి ఆశ్రమ పాఠశాల బియ్యం..

విక్రమపురంలో దర్శనం

1750 కిలోల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఉండాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం విక్రమపురం గ్రామంలో శుక్రవారం దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సివిల్ సప్లై ఉప తహశీల్దార్ రాజేంద్రకు వచ్చిన సమాచారం మేరకు గ్రామంలో మేరంగి గంగయ్య ఇంట్లో తనిఖీ చేశారు. 50 కిలోల బస్తాలు 35 ఉన్నట్లు గుర్తించారు. గతంలో ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలో పనిచేసిన మాజీ వార్డెన్ ఇంట్లో నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు. నిల్వ ఉన్న బియ్యాన్ని స్థానిక డీలర్, గ్రామ రెవెన్యూ అధికారి, మహిళా పోలీస్ సహాయంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 6ఎ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్‌కు అప్పగించారు. ఏదేమైనా విద్యార్థులకు చెందిన రేషన్ బియ్యం అక్రమంగా దారి మళ్లించడంపై పలువురు మండిపడుతున్నారు.

మాజీ వార్డెన్ ఇంట్లో నిల్వ చేసిన బియ్యం బస్తాలు

గ్రామదర్శినిలో అధికారులు

పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గుచ్చిమిలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జోగంపేటలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రసాద్, సూరంపేటలో మార్క్ ఫెడ్ డిఎం విమల పర్యటించారు. ఆయా సచివాలయాల్లో తనిఖీలు చేపట్టారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. గ్రామాలో పరిశుభ్రత, విద్య, వైద్య తదితర కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంఇఒ సూరిదేముడు, వెంకటరమణ, ఎఒ అవినాష్, వైద్యులు ఉషారాణి, పావని, పశువైద్య అధికారి రామారావు, ఎపిఎం శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

మండలంలోని రంగంపేట గ్రామంలో మరడ సింహాచలం పొలంలో శుప్రకారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన వరి పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగాన్ని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంక అధికారి కోట జయప్రకాశ్, తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎఒ ఎస్.అవినాష్, ఎఎస్ఒ సతీష్, విఎఎ ఎం.వాసు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయి తేజ సందర్శించారు. విద్యార్థుల విద్యా బోధన గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ ఆర్.కుమార్ స్వామి, శామ్యూల్, రఘు, ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి, ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల పాల్గొన్నారు.

సంత నర్సిపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని సంతనర్సిపురం గ్రామంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, మధుమేహం, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనాలి

కొమరాడ : రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర రూ.2300కు ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం మండల నాయకులు ఎ.ఉపేంద్ర కోరారు. కొమరాడలో ధాన్యం కొనుగోలుపై వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రైతులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్తు ఛార్జీలు పెంచొద్దని వినతి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తిన మోహన్ రావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎడి కార్యాలయంలో వినతి అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడ్డాకుల చిన్నారావు, గేదెల రామకృష్ణ, సిగడాపు బంగారయ్య, తీళ్ల గౌరీశంకర్, రేసు రాము, బోను శంకర్రావు పాల్గొన్నారు.

సుందర పార్వతీపురానికి సహకరించండి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణాన్ని స్వచ్ఛ, సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారసంస్థలు, దాతలు ముందుకురావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యాపార సంస్థలు, సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది మంచి జిల్లా, మంచి ఊరుగా పేరు ఉందని, దాన్ని నిలుపుకోవలసిన అవసరం అందరిపై ఉందని తెలిపారు. అందులో భాగంగా పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకురావాలని కోరారు. ఒక్కో సంస్థ ఒక్కో ప్రాంతాన్ని దత్తత తీసుకొని, అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, రహదారుల మరమ్మతులు వంటివి ప్రభుత్వం తరపున చేపడుతున్నట్లు చెప్పారు. పార్కులు, ముఖ్య కూడళ్ల అభివృద్ధిని వివిధ సంస్థలు చేపట్టాలని కోరారు. వాటర్ ఫౌంటైన్‌తో కూడిన సెల్ఫీ పాయింట్లు, హోటళ్లు, శ్మశానవాటికలు ఏర్పాటుకు ఆలోచన చేయాలని సూచించారు.. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, గోల్డ్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాలరావు, డాక్టర్ డి.పారినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం.. మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌ని ఎస్‌పి మాధవరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లో రికార్డులు, కేస్ ఫైళ్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారి బాగోగుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రాంబాబు, ఎల్విన్‌పేట సిఐ బి.హరి, ఎస్ఐలు నీలకంఠరావు, నారాయణరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి మాధవరెడ్డి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, గదులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి స్టేషన్ పరిధిలో క్రైమ్ రిపోర్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్విన్‌పేట చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయన చెప్పారు. సారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ హరి, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిసిసి గోడౌన్‌ను పరిశీలించిన పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం



కాలిపోయిన జిసిసి గోడౌన్‌ను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి

వొంండెంఖల్ గ్రామంలో జిసిసి గోడౌన్‌లో గురువారం అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆ గోడౌన్‌ను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి సందర్శించారు. స్థానిక సర్పంచ్ గౌరీశంకర్‌తో మాట్లాడి, ప్రమాద కారణాలు అడిగి తెలుసుకొన్నారు. జిసిసి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఆస్తి నష్టం ఎంత జరిగిందని తెలుసుకున్నారు. చుట్టుపక్కల ఇళ్లు ఉండటంతో ప్రజలకు ఎవరికైనా ఆస్తి నష్టం జరిగితే వారికి నష్టపరిహారం ఇవ్వాలని శ్రీవాణి కోరారు. ప్రమాదం జరిగిన భవనాన్ని కూల్చి దాని స్థానంలో కొత్తది నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణారావు, వైస్ ఎంపిపి ఆరిక రంగారావు, ఎంపిటిసి విధ్యారాణి, సర్పంచులు హిమరిక నాగేశ్వరరావు, అడ్డాకుల మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఐటిడిఎ డిపిఒ సతీష్ కుమార్

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి-సీతంపేట

పులిపుట్టిలో ముక్కిడి పోలమ్మ దేవాలయం వద్ద ఉన్న కన్నెదారకొండపై పర్యాటకాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశాలతో కన్నెదారకొండపై పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ఐటిడిఎ పిఒకు వినతి పత్రం సమర్పించారు. పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఐటిడిఎ అధికారుల బృందం పులిపుట్టి, పి.పి ఈతమానుగూడ గ్రామస్తులతో సమావేశమై, పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించింది. కన్నెదార కొండపై భూములు కలిగి ఉన్న వ్యక్తులు, సంబంధిత గ్రామస్తులు గ్రామసభ తీర్మానం చేసి ఇవ్వాలని అధికారులు తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో పర్యాటకశాఖ, ఐటిడిఎ అధికారుల బృందం కన్నెదార కొండను సర్వే చేయనున్నట్లు చెప్పారు. కన్నెదార కొండపై వ్యూ పాయింట్, రోడ్లు, ట్రెక్కింగ్ రూట్, రోప్ వే వంటివి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిపిఒ సతీష్ కుమార్, ప్రజాప్రతినిధులు సవరతోట మొఖలింగం, సర్పంచ్ బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో దూళికేశ్వర ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలను శుక్రవారం ఎస్ఐ నారాయణరావు పూడ్చివేయించారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి, గుంతలను కప్పించారు. దీంతో పోలీసులను ప్రయాణికులు అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి గుంతలు కప్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

పోలీసుల ఆధ్వర్యంలో జంగిల్ క్లియిరెన్స్

మండలంలో గుమ్మ గదబవలస వంతెన వద్ద, సమీపంలో రహదారికి ఇరువైపులో ఉన్న జంగిల్‌ను ఎస్ఐ నారాయణరావు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన వద్ద ఇరువైపులా జంగిల్ ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అందుకు తొలగించినట్లు తెలిపారు.